

మంతూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నర్సాపూర్, జూన్ 1: మండల పరిధిలోని మంతూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన, అలాగే బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, షేక్‌హుస్సేన్, ప్రసాద్, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌కృష్ణాంజలి, జితేందర్‌రెడ్డి, రవికుమార్, సేనాధిపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



తౌర్యాతాండాలో భోగ్ బండార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

**భోగ్ బండార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే**

శివ్వంపేట మండలం బీమ్లా తాండా పంచాయతీలోని తౌర్యాతాండాలో శ్రీ జగదాంబ మాత జాతర ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన భోగ్ బండార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్నానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రమణాగౌడ్, కృష్ణారావు, సత్యంగౌడ్, యాదాగౌడ్, హన్మంత్‌రెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మణ్, జనార్ధన్, గిరిజనులు పాల్గొన్నారు.

## ఆభరణాల ప్రదర్శన అదుర్స్



మలబార్ గోల్డ్, డైమండ్ షోరూమ్‌లో ఆభరణాలు ప్రదర్శిస్తున్న మహిళలు

సిద్దిపేట టౌన్, జూన్ 1: సిద్దిపేటలోని మలబార్ గోల్డ్, డైమండ్ షోరూమ్‌లో ఆదివారం నిర్వహించిన వెండి ఆభరణాల, వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నది. వెండి బంగారు ఆభరణాల ప్రదర్శనకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శారిక్ షరీఫ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడి నాణ్యమైన వస్తువులు మలబార్‌లో అందిస్తున్నామన్నారు. సంస్థ అర్జించిన వార్షిక ఆదాయం నుంచి పేదలకు ఉచిత వైద్యం, విద్య, నిరుపేదలకు గృహ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను చాటుతున్నామన్నారు. ఆభరణాల ప్రదర్శన ఈ నెల 9వరకు కొనసాగుతుందన్నారు. ప్రదర్శనలో స్టోర్ మేనేజర్లు శ్రీకాంత్, వాజిద్ మహిళలు పాల్గొన్నారు.

## సీఐటీయూను గెలిపించాలి



మాట్లాడుతున్న చుక్క రాములు

జహీరాబాద్, జూన్ 1 : జహీరాబాద్ పట్టణ సమీపంలోని మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, మహీంద్రా అండ్ మహీంద్రా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు చుక్కరాములు కోరారు. శనివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ఉత్తం గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5న మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘన విజయం సాధించేందుకు కార్మికులు ఓటేయాలని కోరారు. సీఐటీయూ కార్మిక సంఘాన్ని గెలిపిస్తే కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులకు కార్మికుల పట్ల అవగాహన లేదన్నారు. కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. సమావేశంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు రాజిరెడ్డి, మహిపాల్, కనకారెడ్డి, నారాయణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ నుంచి బోల్తాపడిన లారీ

- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్రగాయాలు



ఫ్లైఓవర్‌పై నుంచి కిందకు పడిన పాత ఇనుప సామగ్రి లోడ్ లారీ

జహీరాబాద్, జూన్ 1: పాత ఇనుప సామగ్రి లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు బోల్తాపడిన సంఘటన జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ నుంచి పాత ఇనుప సామగ్రితో లోడ్ వెళ్తున్న లారీ(ఏపీ 16 టీ హెచ్ 9687) డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి సర్వీస్ రోడ్డుపై బోల్తాపడింది. ఈ సంఘటనలో ఏపీలోని వైఎస్ఆర్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ రమేశ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. సత్యసాయి జిల్లాలోని నాగసముద్రం గ్రామానికి చెందిన క్లీనర్ పాముల వీరేశానికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు భారీ క్రేన్‌ను తెచ్చి లారీని రోడ్డుమీద నుంచి పక్కకు నెట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు.

# మీసేవ కేంద్రాల్లో దోపిడీ

- దరఖాస్తులకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



నాగల్‌గిద్ద మీసేవ కేంద్రంలో దరఖాస్తుదారులు

నాగల్‌గిద్ద, జూన్ 1: విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, కొత్త రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చడం, విద్యుత్తు కనెక్షన్ దరఖాస్తులు, ఇలా ఏవైనా సరే మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సిందే. దరఖాస్తుల ప్రక్రియ అంతా మీసేవ కేంద్రాల్లోనే జరుగుతున్నది. దీనిని అదునుగా భావిస్తు సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం కేంద్రంలో మీసేవ కేంద్రాల్లో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో ఒక్కటే మీసేవ కేంద్రం ఉండడంతో నిర్వాహకులు అదనపు వసూళ్లకు తెరలేపుతున్నారు. తాము చెప్పినంతా ఇవ్వాలని దరఖాస్తుదారులకు సూచిస్తున్నారు. దీంతో చేసేదేమి లేక దరఖాస్తుదారులు అడిగినంతా సమర్పించుకుంటున్నారు. ఏ దరఖాస్తుకు ఎంత రుసుం తీసుకోవాలో ప్రభుత్వం ఇది వరకే నిర్ణయించింది. కానీ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణ దరఖాస్తులకు రూ.45 వసూలు చేయాల్సి ఉంటే, రూ. 80 దరఖాస్తు ఫారానికి తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తెలియనివారు వస్తే సాధారణ దరఖాస్తుకు రూ. 80నుంచి రూ. 100 తీసుకుంటున్నారని, విద్యుత్ కనెక్షన్ దరఖాస్తులకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రవేశాలు ఉన్నాయి. విద్యార్థులకు ప్రవేశాలు, కౌన్సిలింగ్ జరుగుతున్నాయి. వారికి వివిధ ధ్రువ పత్రాలు అవసరం. వారికి అన్ని అవసరం లేకున్నా ధ్రువ పత్రాలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంటున్నారు. గతంలో కుల ధ్రువీకరణ పత్రం తీసుకునన వారిని మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. వాస్తవానికి ఆదాయ ధ్రువీకరణ పత్రం మాత్రం ప్రతి ఏడాదికి కొత్తది అవసరం అవుతుంది.కుల ధ్రువీకరణ పత్రం ఒకసారి మీసేవ ద్వారా తీసుకుంటే మళ్లీ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఓబీసీ , ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రం ప్రతి ఏడాది కొత్తది తీసుకోవాలి. కానీ, అన్ని ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేయిస్తు ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చెరువు కాదది.. కాలుష్య కాసారం

- రసాయన పరిశ్రమల వ్యర్థ జలాలతో ఎర్రగా మారిన చెరువు నీరు
- చర్యలు తీసుకోని పీసీబీ అధికారులు?
- పక్షుపక్ష్యాదులు ఈ నీరు తాగితే ప్రాణాలు హరి
- ఎవుసానికి పనికిరాకుండా పోతున్న భూములు

### దోమడుగు నల్లకుంట కాలుష్యమయం



దోమడుగు నల్లకుంటలో రసాయన వ్యర్థాలతో ఎర్రగా మారిన నీళ్లు



దోమడుగు నల్లకుంటలో వ్యర్థ జలాలతో పెరిగిన చెట్లు ఎండిపోతున్న దృశ్యం

గుమ్మడిదల, జూన్ 1: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు మున్సిపల్ వార్డులోని పారిశ్రామికవాడ శివారులో ఉన్న నల్లకుంట చెరువు కాలుష్య కాసారంగా మారింది. నల్లరేగడి భూమిలో ఈ చెరువును నిర్మించడంతో నల్లకుంటగా పేరు స్థిరపడింది ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందు ఈ చెరువు ఆధారంగా రైతులు పంటలు పండించుకున్నారు. పశుపక్ష్యాదుల దాహం తీర్చుకోవడానికి ఈ చెరువు నీరు ఉపయోగపడింది. కానీ, ప్రస్తుతం చెరువు నీరు వ్యవసాయం చేయడానికి పశుపక్ష్యాదులు తాగడానికి పనికి రాకుండా పోయింది. పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ జలాలతో నల్లకుంట చెరువు నీళ్లు కలుషితమై ఎర్రగా మారాయి. ఈ చెరువు శివారులో ఉన్న పరిశ్రమల ఔట్‌లెట్ల ద్వారా వర్షపు నీటితో పాటు పరిశ్రమల వ్యర్థ జలాలు రావడంతో పూర్తిగా చెరువు పూర్తిగా కాలుష్యమయంగా మారింది. గతంలో దోమడుగు గ్రామస్తులు పరిశ్రమల వ్యర్థ జలాలకు వ్యతిరేకంగా ధర్నాలు, రాస్తారోకోలో నిర్వహించారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ, ఫలితం లేకుండా పోయింది. వ్యర్థ జలాలు వదులుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. విచ్చలవిడిగా వ్యర్థజలాలు వదలడంతో వానకాలంలో చెరువునిండి గొలుసు కట్టు చెరువులైన రాజనా టల చెరువు, వావిలాల చెరువు, రాయుడి చెరువు, తదితర చెరువులు సైతం రసాయన వ్యర్థజలాలతో కలుషితం అవుతున్నాయి. ఫలితంగా వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉన్న కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేయలేక, ఒకవేళ పంటలు పండిస్తే ఆ ధాన్యాన్ని రైతులు తినలేక పోతున్నారు. వేలాది రైతులు నష్టపోవడమే కాకుండా భూగర్భజలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయి. పర్యావరణం కలుషితం కావడంతో ఇక్కడి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పీసీబీ అధికారులకు ఈ విషయం తెలిసినా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విచ్చలవిడిగా వ్యర్థజలాలను వదులుతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

## ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే



దిగ్వాల్ మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, జూన్ 1: మండలంలోని దిగ్వాల్ గ్రామంలో నిర్వహిస్తున్న మైసమ్మ ఆలయ ఉత్సవాలకు ఆదివారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల సాగుతో ఆదాయం

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సేవానాయక్



చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సేవానాయక్

సిర్గాపూర్, జూన్ 1: రైతులు చిరుధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, చిరుధాన్యాలు సాగుచేసి మంచి ఆదాయం పొందాలని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సేవానాయక్ అన్నారు. మండలంలోని కిషన్‌నాయక్ తండాలో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాల్లో ఉండే పోషకాలు, వాటి సాగు, ఉపయోగం పట్ల ఆయన రైతులకు వివరించారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, గోధుమలు, మొక్కజొన్న, వరిగెలు పంటలను రైతులు సాగుచేయాలన్నారు. అధిక దిగుబడులతో ఆర్థిక ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రమేశ్, హేమలత, శైలజ, వాటర్‌సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రవిప్రసాద్, టెక్నీషియన్స్ రాజు, వినయ్, వసుంధర సేవక్ నాందేవ్, రైతులు పాల్గొన్నారు.


## రంగస్థల కళావేదిక నూతన కమిటీ ఏర్పాటు



కళాకారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి

జిన్నారం, జూన్ 1: బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీశివసాయి రంగస్థల కళావేదిక గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బొల్లారం కేబీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సంఘం అధ్యక్షుడిగా ఆర్.లక్ష్మీనాయుడు, ఉపాధ్యక్షులుగా ఈశ్వర్‌రావు, వెంకటరావు, అప్పారావు, అప్పలస్వామి, ప్రధాన కార్యదర్శిగా అనంతరావు, సహాయ కార్యదర్శులుగా భుజంగరావు, కృష్ణ, ఆదినారాయణ, నాగభూషణరావు, కోశాధికారులుగా అప్పారావు, కాళిదాసు, కార్యవర్గ సభ్యులుగా ఆనందరావు, రమేష్, చిన్నారావు, మోహన్‌రావు, వెంకటరావు, గోపాలకృష్ణ, సుచింద్రి, తేజేశ్వరరావు, నారాయణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... రంగస్థల కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. రంగస్థల నాటక కళాకారుల అభ్యున్నతికి ప్రభుత్వపరంగా అన్నివిధాలా సహకరిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు నాయుడు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిలక్ష్మి, కళాకారులు పాల్గొన్నారు.


## కాలనీ సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేటర్‌కు వినతి పత్రాన్ని అందజేసున్న విద్యుత్‌నగర్ కాలనీవాసులు

రామచంద్రపురం, జూన్ 1: డివిజన్ పరిధిలోని విద్యుత్ నగర్ కాలనీ వాసులు పలు సమస్యలపై భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్ రెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... వర్షపు నీటిలో కాలువల డిసిల్టింగ్ పనులు చేపట్టాలని, దోమల బెడద ఎక్కువగా ఉన్నందున వారానికి రెండుసార్లు దోమల మందు పిచికారీ చేయించాలని విన్నవించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం కొత్త పైప్‌లైన్ వేయాలని, డిసిల్టింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి కొత్త ప్రతిపాదనలు పెట్టి మంజూరు చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ నగర్ కాలనీ అధ్యక్షుడు అజీమ్ పాల్గొన్నారు.

## ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్ర గాయాలు



రామాయంపేట దవాఖానలో చికిత్స పొందుతున్న రైతు

రామాయంపేట, జూన్ 1: మెదక్ జిల్లా రామాయంపేట మండలం సదాశివనగర్ గిరిజన తండాలో ఆదివారం తెల్లవారుజామున రైతు బాత్రోత్ హనుమంతుపై ఎలుగుబంటి దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం రాత్రి బాత్రోత్ హనుమంతు తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పొలానికి నీరు పారబెట్టాడు. తిరిగి తెల్లవారుజామున పొలం నుంచి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి అతడిపై దాడిచేసింది. రైతు తనవద్ద ఉన్న కర్రతో ఎలుగుబంటిపై దాడికి యత్నించగా వెళ్లిపోయింది.అప్పటికే రైతుకు తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబీకులు బాధిత రైతును రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

## రోడ్లపై ధాన్యపు కుప్పలతో తిప్పలు



కంగ్టి –పిట్లం రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న

కంగ్టి, జూన్ 1: రైతులు పండించిన పంట ఉత్పత్తులు రోడ్లపై ఆరబోస్తుండడంతో ప్ర యాణికులకు తిప్పలు తప్పడం లేదు. కంగ్టి నుంచి పిట్లం వెళ్లే దారిలో రైతులు డబుల్ రోడ్డుకు ఓవైపు పూర్తిగా వడ్లు, మొక్కజొన్న, జొన్నలు ఆరబోస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిలో 6 నెలలు రోడ్లపై ఇదే పరిస్థితి ఉంటుండడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నా యి. రాత్రివేళలో ప్రయాణం నరకంగా మారుతున్నదని తడ్కల్, కంగ్టి, జమ్గి(కె), జమ్గి(బి), చాప్టా(కె) గ్రామాల వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబోసే క్రమంలో రైతులు ధాన్యం కుప్పల వద్ద పెద్దరాళ్లు పెడుతుండడంతో వాహనాలకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో ధాన్యం కుప్పలు కనబడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంట ఉత్పత్తులు ఆరబోసేందుకు ప్లాట్‌ఫామ్‌లు నిర్మించుకొనే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఈ రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పంట ఉత్పత్తులు పోయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నేరడిగుంటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అందోల్, జూన్ 1: మండలంలోని నేరడిగుంట ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరతగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు.

**కంగ్టిలో..**

కంగ్టి, జూన్ 1: కంగ్టిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2007–08 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. అప్పట్లో పనిచేసిన ఉపాధ్యాయులకు శాలువాలతో సత్కరించారు.



కంగ్టి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

## దిగ్వాల్‌లో వైభవంగా బోనాలు



బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

కోహీర్, జూన్ 1: మండలంలోని దిగ్వాల్‌లో ఆదివారం బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలతో గ్రామ శివారులోని మైసమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయం వరకు పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాల మధ్య శోభాయాత్ర కొనసాగింది. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. సోమవారం జాతర ముగింపు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నప్రసాదం వితరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



బొంతపల్లిలో పూజలు చేస్తున్న వేదపండితులు

గుమ్మడిదల, జూన్ 1: గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను వేదపండితులు వైభవంగా నిర్వహిస్తున్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి మున్సిపల్ వార్డులో ఆలయకమిటీ అధ్యక్షుడు కావలి శంకర్‌యాదవ్, వీరభద్రస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్, సద్దివిజయభాస్కర్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి, పోచమ్మతల్లి, చిత్తరామ్మతల్లి, నాగదేవతల ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం వేదపండితులు కిరణ్ కుమార్‌శర్మ, చైతన్యశర్మ మంత్రోచ్చరణలతో క్రతువులను నిర్వహించారు. సోమవారం గ్రామదేవతలకు ప్రాణప్రతిష్ఠ, మూర్తి స్థాపన, శిఖరప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

## నీటిట్యాంకు కూల్చివేత



కూల్చివేసిన మంచినీటి సరఫరా ట్యాంక్

నిజాంపేట్, జూన్ 1: మండల కేంద్రమైన నిజాంపేట్ బాలికల ప్రాథమిక పాఠశాలలో శిథిలాస్థితికి చేరి ప్రమాదకరంగా మారిన తాగునీటి సరఫరా ట్యాంకును ఆదివారం అధికారులు కూల్చివేశారు. ట్యాంకు శిథిలావస్థకు చేరిందని ఇటీవల 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వార్త ప్రచురితం కాగా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి కూల్చివేశారు. నమస్తే తెలంగాణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేద్దాం



మాట్లాడుతున్న విమలక్క

పాపన్నపేట, జూన్ 1: స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు అవుతున్నా అంబేద్కర్ కోరుకున్నట్లు సంపద వికేంద్రీకరణ కాలేదని అరుణోదయ సాంస్కృతిక సమైక్య చైర్‌పర్సన్ విమలక్క పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని అన్నారంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం అన్నారం నుండి కొత్తపల్లి వరకు భారీఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించారు. కొత్తపల్లిలో జరిగిన సమావేశంలో అమె మాట్లాడుతూ సంపద అందరి చేతుల్లో ఉండాలని అంబేద్కర్ కోరుకున్నారని, నేటికి కొంత మంది చేతుల్లో ఉండడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు దాసురాం నాయక్, జనప్రియ, గ్రామస్తులు, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి భూభారతి సదస్సులు

నాగల్‌గిద్ద, జూన్ 1: భూభారతి సదస్సుల గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని తహసీల్దార్ శివకృష్ణ పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి మండలంలో అన్ని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి భూభారతి సదస్సులు నిర్వహిస్తామని ఆదివారం ప్రకటనలో తెలిపారు. సదస్సులకు ఒక రోజు ముందుగానే గ్రామాల్లో దరఖాస్తు ఫారాలు అందజేస్తామని తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి భూసమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు

**సదస్సులు వినియోగించుకోవాలి**

కంగ్టి, జూన్ 1: ఈనెల 3 నుంచి మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కంగ్టి తహసీల్దార్ భాస్కర్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరుల మాట్లాడుతూ.. భూభారతి చట్టంపై అన్ని గ్రామాల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. 3న జమ్గి(బి), దెగుల్‌వాడి 4న జమ్గి(కె), భీంరా, 5న ఎంపల్లి, నాగూర్(కె) 6న వల్మూర్, నాగూర్(బి) 9న బాన్సువాడ, సిద్దంగిర్గ 10న దామరిగిద్ద, ఎన్కెమూరి 11న ఘన్‌పూర్, రాంతీర్థ్, 12న రాసోల్, నాగన్‌పల్లి, 13న ముర్కుంజాల్, గాజుల్‌పాడ్, 16న చాప్టా(కె), సుక్కల్‌తీర్థ్, 17న తుర్కవడగామ, చాప్టా(బి), 18న కంగ్టి, బోర్గిలో సదస్సులు ఉంటాయని చెప్పారు.

## కారుబోల్తా.. ఉపాధ్యాయుడి మృతి

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 1: కారు బోల్తాపడిన ఘటనలో ఉపాధ్యాయుడు మృతిచెందాడు ఆదివారం కొండపాక మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన కడారి రవి అనే ఉపాధ్యాయుడు కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న క్రమంలో కొమురవెల్లి కమాన్ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడు రవి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భర్త దాడిలో భార్య మృతి

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 1: భర్త క్షణికావేశంతో భార్య ప్రాణాలు కోల్పోయిన ఘటన కొండపాక మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కొండపాకకు చెందిన పొన్నాల మల్లేశం భార్య యశోద(45)కు తరుచూ గొడవలు జరిగేవి. ఎప్పటిలాగే శనివారం ఇంట్లో ఇరువురి మధ్య గొడవ జరిగింది. అది కాస్తా పెరిగి పెద్దది కావడంతో మల్లేశం ఆవేశంతో చేతిలో ఉన్న పారతో భార్య యశోద తలపై కొట్టడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఆమెను వెంటనే సిద్దిపేటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.